క్లుప్తంగా

భక్తులకు ఇబ్బందులు లేకుండా ఉత్తర ద్వార దర్శనం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పుప్పాల వెంకట కృష్ణారావు

నరసాపురం: పట్టణంలోని ప్రసిద్ధ శ్రీ ఆదికేశవ ఎంబేరుమానార్ కోవెలలో ఈ నెల 10న వైకుంఠ ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని స్వామి వారి ఉత్తర ద్వార దర్శన ఏర్పాట్లు ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ ఫౌండర్ ట్రస్టీ పుప్పాల వెంకట కృష్ణారావు చెప్పారు. బుధవారం ఆలయ ఈఓ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోనే ప్రసిద్ధ దేవాలయాల్లో ఒకటిగా పేరున్న ఎంబేరుమానార్ స్వామి వారికి ప్రస్తుతం ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయన్నారు. స్వామి వారి ఉత్తర ద్వార దర్శనానికి సంబంధించి ప్రత్యేక దర్శనాలు రద్దు చేశామన్నారు. ప్రతి ఒక్కరికీ ఉచిత దర్శనాలు కల్పిస్తున్నామన్నారు. ఆదికేశవ ఎంబేరుమానార్ ఆలయాలు దేశంలో రెండు మాత్రమే ఉన్నాయన్నారు. తమిళనాడులోని పెరంబదూర్‌లోను, నరసాపురంలోనూ ఉన్నాయన్నారు. 300 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ దేవాలయంలో ఉత్తర ద్వార దర్శనాలకు ప్రత్యేకత ఉందన్నారు. కల్యాణ ఉత్సవాలు భోగి రోజుతో ముగుస్తాయని చెప్పారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు



గొందిమూల ప్రాథమిక పాఠశాలలో భోగి మంట వేస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: మండలంలోని గొందిమూల ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులకు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని సంక్రాంతి విశిష్టతను గురించి వివరించారు. ఈ సందర్భంగా బొమ్మల కొలువు, గొబ్బిళ్లు, వేషధారణలు పలువుర్ని ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు ముగ్గుల పోటీలు, డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమాలను నిర్వహించిన ఉపాధ్యాయురాలు ఉప్పుగంటి రాజ్యలక్ష్మిని పలువురు అభినందించారు.

గరగాలమ్మ జాతర ప్రారంభం



సిద్ధాంతంలో గరగాలమ్మ మహోత్సవాలు ప్రారంభిస్తున్న దృశ్యం

పెనుగొండ: సిద్ధాంతంలో గరగాలమ్మ జాతర మహోత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా ప్రారంభించారు. గరగాలమ్మ దిబ్బ శెట్టి బలిజ సంఘ ఆధ్వర్యంలో గరగాలమ్మను నిలబెట్టి ఉత్సవాలు ప్రారంభించారు. గ్రామ దేవత మావుళ్లమ్మ, సోమాలమ్మ, పోతురాజుల ఆలయాలకు గరగలతో వెళ్లి నైవేద్యాలు సమర్పించారు. మంగళవారం మకర సంక్రాంతి సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ చేతుల మీదుగా జాతరను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

13 మంది బైండోవర్

పెనుగొండ: సంక్రాంతి సందర్భంగా ఎటువంటి జూదాలకు పాల్పడకుండా 13 మందిని బైండోవర్ చేశామని పెనుగొండ ఎస్సై కె.గంగాధర్ తెలిపారు. బుధవారం వీరిని తహసీల్దారు జి.అనితకుమారి ముందు హాజరుపరిచామని పేర్కొన్నారు. మండలంలో ఎవరైనా జూద క్రీడలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పంచాయతీ కార్యదర్శుల క్యాలెండర్ ఆవిష్కరణ

పాలకొల్లు అర్బన్: పంచాయతీ కార్యదర్శుల సంఘం క్యాలెండర్, డైరీని జిల్లా కలెక్టర్ సీహెచ్ నాగరాణి చేతుల మీదుగా ఆవిష్కరించినట్లు సంఘ జిల్లా అధ్యక్షుడు పాలా శారదా శ్రీనివాస్ తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం జిల్లా పంచాయతీ అధికారి అరుణశ్రీ సమక్షంలో డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో దొంగ సత్యనారాయణ, దేవాబత్తుల నాగదేవి, సుంకర వెంకటేష్ పాల్గొన్నారు.

ఆడియో అండ్ టెక్నీషియన్ అధ్యక్షుడిగా బసవరాజు

పాలకొల్లు సెంట్రల్: పట్టణ ఆడియో అండ్ వీడియో టెక్నీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మానెం బసవరాజు ఐదో సారి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. బుధవారం స్థానిక సమత మహిళా విజ్ఞాన భవనంలో అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో అధ్యక్షుడిగా మానెం బసవరాజు, సెక్రటరీ వట్టి శ్రీనివాస్, ట్రెజరర్ బత్తుల నాగేశ్వరరావులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గద్దేటి కేధారేశ్వరరావు, బొడ్డపాటి సూరిపండు, నంబూరి పుల్లయ్య పాల్గొన్నారు.


తూతూమంత్రంగా రోడ్ల మరమ్మతులు

- పనుల్లో నాణ్యతా లేమి
- రాళ్లు లేచిపోయి అధ్వానంగా మారుతున్న రోడ్లు

నరసాపురం రూరల్: సంక్రాంతి సమయానికి గోతుల్లేని రహదారులంటూ ప్రచారంతో హోరెత్తిస్తున్న కూటమి ప్రభుత్వ నాయకులు రోడ్ల మరమ్మతులు మాత్రం తూతూ మంత్రంగా చేస్తున్నారు. నియోజకవర్గంలోని పలు ఆర్అండ్‌బీ రహదారుల మరమ్మతులకు సంబంధించి రూ.2.50 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని సుమారు 15 రోడ్లలోని గుంతలను పూడ్చాల్సి ఉంది. అయితే సీతారామపురం నుంచి పేరుపాలెం, రుస్తుంబాద నుంచి కొప్పర్రు, మెట్రేవు నుంచి పేరుపాలెం, మోడి నుంచి కరింశెట్టిపాలెం వెళ్లే రహదారులకు సంబంధించి ఇప్పటికే మరమ్మత్తులు పూర్తి చే శారు. ఈ పనుల్లో ఇంకా మొగల్తూరు మండలం ముత్యాలపల్లి నుంచి వెంప రహదారి, నరసాపురం నుంచి భీమవరం రహదారుల మరమ్మతులకు సంబంధించి పాక్షికంగా గోతులున్న ప్రాంతాల్లో చిన్న మెటల్‌రాళ్లు వేశారు. పనులు ఏకకాలంలో చేయకుండా గోతులను పాక్షికంగా చిన్నచిప్స్‌తో పూడ్చి వదిలివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడికక్కడ దుమ్ము లేచిపోవడంతో ప్రధానంగా ద్విచక్రవాహనాలపై ప్రయాణించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉంటే సీతారామపురం నుంచి పేరుపాలెం రహదారి పనులు పూర్తయినట్లు చెబుతున్నప్పటికీ ఆ రోడ్డును చూస్తే పలు ప్రాంతాల్లో రోడ్డుపై గుంతలు కనిపిస్తూనే ఉన్నాయి. సీతారామపురం శివారు ప్రాంతంలోనూ, పసలదీవి ప్రారంభంలోనూ పలు ప్రాంతాల్లో నాణ్యత లేకుండా పూడ్చిన గోతుల్లో తిరిగి రాళ్లు పైకి లేచి మళ్లీ యథాస్థానానికి గోతులు చేరుతున్నాయి. పేరుపాలెం బీచ్‌కు వెళ్లే పర్యాటకులకు ఈ రహదారే ప్రధానమైనప్పటికీ ఇటీవల కార్తీకమాసంలో సైతం ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతూ ప్రయాణం సాగించారు. ఇప్పుడు గోతులు పూడ్చామని చెబుతున్నప్పటికీ ఎక్కడి గోతులు అక్కడే దర్శనమిస్తున్నాయి. నరసాపురం–భీమవరం రహదారిలో సరిపల్లి,



లిఖితపూడిలో పూడ్చిన గోతిలో రాళ్లు పైకి లేచిన దృశ్యం



సీతారామపురంలో తూతూ మంత్రంగా పూడ్చిన గోతులు ఇలా →

లిఖితపూడి సరిహద్దు ప్రాంతంలో రోడ్డు గోతులమయమైంది. ఆ ప్రాంతంలో పలు చోట్ల గోతులు పూడ్చే పనుల పేరుతో రోడ్డుపై చిన్నకంకర చిప్సను సర్ది వదిలేయడంతో రాళ్లు, దుమ్ములేచి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. 15 ప్రాంతాల్లో రోడ్లు మరమ్మతులు చేయాల్సి ఉండగా కేవలం రెండు, మూడు ప్రాంతాల్లోనే గోతులపూడిక పూర్తయ్యింది. ఇప్పుడు హడావుడిగా గోతులు పూడ్చామని చెబుతున్నప్పటికీ ఎక్కడి గోతులు అక్కడే దర్శన మిస్తుండటంతో కూటమి ప్రభుత్వం పనుల నాణ్యతలో డొల్లతనం కళ్లకు కట్టినట్లు కనిపిస్తుందని ప్రజలు వాపోతున్నారు.

ఇదెక్కడి చోద్యం?



గోతులతో దర్శనిమిస్తున్న పెనుగొండ వంతెన

పెనుగొండ: మండలంలో చేపట్టిన రోడ్ల మరమ్మతుల్లో గోతులను సగం మాత్రమే పూడ్చి వదలివేస్తుండడంతో ఇదేమి చోద్యమంటూ ప్రజలు ముక్కున వేలు వేసుకొంటున్నారు. పెఎనుగొండలోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయం సమీపంలో భారీ గోతితో వాహన దారులు ఇబ్బందులు పడేవారు. గోతులు పూడుస్తున్నామని చెప్పి సగం గొయ్యి మాత్రమే పూడ్చి మిగిలిన సగం వదిలేశారు. అలాగే అశ్వారావు–పేట నర్సాపురం రహదారిలో పెనుగొండ ఫ్లై ఓవర్ అంతా గోతులమయంగానే ఉన్నాయి. ఆర్భాటంగా రోడ్లు భవనాల శాఖ నిధులు విడుదల చేశామంటూ ప్రకటించినా వంతెనపై గోతులు ఇంకా ఇబ్బందులు పెడుతూనే ఉన్నాయి. వంతెన పై గెడ్డర్లు సైతం లేచి పోయి దర్శనం ఇస్తుండడంతో గోతులో ప్రయాణం నరక ప్రాయంగా మారుతుందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు సంక్రాంతి నాటికి గోతులు పుడస్తారా..?సీఎం సారూ అంటూ ప్రశ్నిస్తున్నారు.

ఈ రహదారుల్లో ప్రయాణమెలా?



అధ్వానంగా ఉన్న వేడంగి - జిన్నూరు కాలువ గట్టు రోడ్డు



జిన్నూరుపాలెం ప్రధాన రహదారి దుస్థితి

పోడూరు: మండలంలోని జిన్నూరు – వేడంగి కాలువ గట్టు రోడ్డు గోతులతో పుంత రోడ్డును తలపిస్తోంది. గత ఏడేళ్లుగా ఈ రోడ్డు ఇదే దుస్థితిలో ఉంది. దాదాపు రెండు కిలోమీటర్లు ఉన్న ఈ రోడ్డు ఆరేళ్ల క్రితం జిల్లా పరిషత్ రోడ్డుగా అప్‌గ్రేడ్ చేసి వేడంగి వైపు నుంచి సుమారు 250మీటర్లు బీటీ రోడ్డు నిర్మించారు. మిగిలిన రోడ్డును అలాగే వదిలేశారు. దీంతో ఈ మార్గంలో ప్రయాణించడానికి ప్రజలు నరకయాతన పడుతున్నారు. రహదారిపై భారీ గోతులతో పాటు రాళ్లు పైకి లేచి ప్రమాదకరంగా మారింది. దీంతో ద్విచక్రవాహనాలపై వెళ్లే వారు అదుపు తప్పి పడిపోయి ప్రమాదాలకు గురౌతున్నారు. జిన్నూరు గ్రామ శివారులోని అన్నపూర్ణమ్మ పేట, సుబ్బారాయుడు కాలనీ ప్రాంత వాసులు నిత్యం ఈ రహదారి పైనే రాకపోకలు సాగిస్తుంటారు. ఈ మార్గంలో రాత్రి సమయంలో వీధిలైట్లు కూడా లేవు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు రాత్రి సమయంలో ఈ మార్గం గుండా వెళ్లడానికి మరింత అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ఈ రహదారిని అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

జిన్నూరుపాలెం ప్రధాన రహదారి దుస్థితి ఇదీ

జిన్నూరు – జిన్నూరుపాలెం గ్రామాల మధ్య గల జిల్లా పరిషత్ రోడ్డు కూడా గోతులతో అధ్వాన్నంగా తయారైంది. ఈ రోడ్డు కూడా ఏడు, ఎనిమిదేళ్లుగా ఏ విధంగానూ అభివృద్ధికి నోచుకోలేదు. సుమారు మూడు సంవత్సరాల క్రితం తాత్కాలిక మరమ్మతులు చేశారు. ఈ రోడ్డు ఎప్పటి నుంచో మెటల్‌రోడ్డుగా మిగిలిపోవడంతో జిన్నూరు పాలెం గ్రామ ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో రోడ్డు జారుడుబల్లగా మారి ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. జిన్నూరు పాలెం గ్రామం నుంచి 9, 10 తరగతి విద్యార్థులు దాదాపు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న జిన్నూరు జెడ్పీహైస్కూల్‌కి సైకిల్‌పై వెళుతుంటారు. రోడ్డు అధ్వానంగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు.అలాగే పాలకొల్లు పట్టణంలోని లాకుల వద్ద నుంచి పూలపల్లి వరకు గల ఆర్‌అండ్‌బీ రోడ్డు గోతులు పడి ప్రమాదకరంగా మారింది.

తారు రోడ్డు నిర్మించాలి



జిన్నూరు పాలెం రోడ్డు ఎంతో కాలం నుంచి మెటల్ రోడ్డుగా మిగిలిపోయింది. దాదాపు 10 ఏళ్ల నుంచి ఏ విధమైన అభివృద్ధికి నోచుకోలేదు. సుమారు మూడేళ్ల క్రితం తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. తక్షణం ఈ రోడ్డును తారు రోడ్డుగా అభివృద్ధి చేయాలి.

– తొండ శ్రీనివాస్, జిన్నూరుపాలెం

ప్రమాదకరంగా కాలువ గట్టు రోడ్డు



జిన్నూరు– వేడంగి గ్రామాల మధ్య కాలవ గట్టు రోడ్డు గోతులతో చాలా ప్రమాదకరంగా ఉంది. మరో వైపు పాలకొలుల – మార్టేరు రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఈ పనులతో తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. కాలువ గట్టు రోడ్డుని కూడా అభివృద్ధి చేస్తే ప్రత్యామ్నాయ రహదారిగా ఉపయోగపడుతుంది. ట్రాఫిక్ ఇబ్బందులు కొంతవరకు తగ్గుతాయి.

– కాకర వెంకటేశ్వరరావు, సీపీఎం మండల కార్యదర్శి, పోడూరు

ప్రజల సమస్యలపై పోరాడండి



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో చదలవాడ మెర్లిన్



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఆబోతు అర్పన్‌కుమార్

నరసాపురం: అధికారం లేదని నిరుత్సాహ పడొద్దని, నాయకులకు, కార్యకర్తలకు తాను అండగా ఉంటానని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పశ్చిమగోదావరి జిల్లా పార్టీ యువజన విభాగం నేతలకు సూచించారు. ఇటీవల కొత్తగా పార్టీ పదవులు చేపట్టిన పార్టీ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు చదలవాడ మెర్లిన్, నరసాపురం పట్టణ అధ్యక్షుడు ఆబోతు అర్పన్‌కుమార్‌లు బుధవారం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఇద్దరు యువ నాయకులను ఆప్యాయంగా పలకరించిన జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ పదవులను బాధ్యతగా నిర్వహించాలని సూచించారు. ప్రజల పక్షాన, ప్రజా సమస్యలపై పోరాడాలని స్పష్టం చేశారు. కష్టకాలంలో పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

పంట బీమాను ప్రభుత్వమే చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకట నారాయణరెడ్డి

పెనుమంట్ర: పంటల బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లిస్తే రైతాంగానికి మేలు జరుగుతుందని ఆ దిశగా ప్రభుత్వం ఆలోచించాలని పెనుమంట్ర ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి కోరారు. బుధవారం పెనుమంట్ర మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈసమావేశంలో రైతులు పంట నష్ట పరిహారం పథకం కింద ఎకరాకు రూ. 616లు చెల్లించాలని వ్యవసాయ శాఖ అధికారిణి జోషుల సభను ఉద్దేశించి మాట్లాడటంతో గతంలో ప్రభుత్వం రైతుల పేరుతో ప్రభుత్వమే చెల్లించేదని అలా చేస్తే బాగుంటుందని ఎంపీపీ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వివిధ అభివృద్ధి పనులను అధికారులు వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు ఈది అనిత, వాసంశెట్టి రవీంద్ర, డీటీ ఏలియమ్మ, ఎంపీడీఓ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం పెంపునకు కృషి చేయాలి



సమావేశంలో డీఎల్‌పీఓకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఈఓపీఆర్‌డీ టి.మూర్తిబాబు

పాలకొల్లు అర్బన్: పంచాయతీ ఆదాయం పెంపునకు కార్యదర్శులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని నరసాపురం డివిజనల్ పంచాయతీ అధికారి జ్యోతిర్మయి కోరారు. పాలకొల్లు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రేడ్–1 నుంచి గ్రేడ్–5 కార్యదర్శులకు నిర్వహించిన సమీక్షా సమావేశంలో జ్యోతిర్మయి పాల్గొని మాట్లాడారు. పాలకొల్లు మునిసిపాల్టీలో విలీన గ్రామాల్లో సైతం ఉపాధి హామీ పథకంలో పనులు నిర్వహించేందుకు గ్రామ సభలు పూర్తి చేసిన నేపథ్యంలో ఆ గ్రామాలతో పాటు అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, కొత్త ఇళ్లకు పన్నులు ఏర్పాటు, ఇంటి పన్నుల వసూళ్లు, పంచాయతీ చెరువులు, కొబ్బరిచెట్లు వేలం పాటలు సకాలంలో పూర్తి చేసి ఆదాయం పెంపునకు తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో పాలకొల్లు, యలమంచిలి, పోడూరు ఈఓపీఆర్‌డీలు తాళ్ల మూర్తిబాబు, జేడీవీ ప్రసాద్, కేఎం వైభవతి తదితరులు పాల్గొన్నారు.

గుంపర్రు రామాలయంలో లక్ష తులసి పూజ

యలమంచిలి: మండలంలోని గుంపర్రులో శ్రీసీతారామస్వామి దేవస్థానంలో బుధవారం ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా లక్ష తులసి పూజ నిర్వహించారు. పాలమూరు వాస్తవ్యులు శ్రీలక్ష్మీ హయగ్రీవాచార్యులు బ్రహ్మత్వంలో ఆలయ అర్చకులు ఖండవల్లి వెంకట సూర్యనారాయణాచార్యులు (బుజ్జి), ఖండవల్లి సీతారామ భార్గవ పర్యవేక్షణలో వైఖానస ఆగమం ప్రకారము లక్ష తులసి పూజ చేశారు.

రెండు రోజులపాటు వైఎన్ కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకలు



ప్లాటినం జూబ్లీ బ్రోచర్ విడుదల చేస్తున్న చినిమిల్లి సత్యనారాయణ, ఇతర పాలకవర్గ సభ్యులు

నరసాపురం: స్థానిక వైఎన్ కళాశాల స్థాపించి 75 సంవత్సరాలు కావడంతో యాజమాన్యం ప్లాటినం జూబ్లీ వేడుకలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తుంది. ఈనెల 10,11 తేదీల్లో ప్లాటినం జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్టు పాలకవర్గం ప్రకటించింది. బుధవారం కళాశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ వివరాలు వెల్లడించారు. 10న మంత్రి నారా లోకేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందరేశ్వరి, హైకోర్టు రిటైర్డ్ జడ్జిలు గ్రంధి భవానీప్రసాద్, డీఎస్ఆర్ వర్మ హాజరవుతారన్నారు. సినీరంగం నుంచి పూర్వ విద్యార్థులు గజల్ శ్రీనివాస్, చేగొండి అనంతశ్రీరామ్ హాజరవుతారని చెప్పారు. 11న ముగింపు వేడుకలకు కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ హాజరవుతారన్నారు. ఈ వేడుకలకు రాలేకపోతున్న సినీ నటుడు చిరంజీవి తన సందేశాన్ని ఇప్పటికే పంపారని, ప్రత్యేక వీడియో కూడా ఆయన విడుదల చేస్తారని చెప్పారు. అనంతరం వేడుకల బ్రోచర్‌ను విడుదల చేశారు. సమావేశంలో కళాశాల ఉపాధ్యక్షుడు పొన్నపల్లి శ్రీరామారావు, పీజీ కోర్సుల డైరెక్టర్ డాక్టర్ నిమ్మల చింతారావు, పాలకవర్గ సభ్యులు పోలిశెట్టి రఘురామారావు, సీహెచ్ రెడ్డప్ప ధవేజీ, కోటిపల్లి వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ సీహెచ్ కనకారావు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి

పెనుమంట్ర: పదో తరగతిలో చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ఆయా సబ్జెక్టులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఉత్తీర్ణత సాధించేలా తర్ఫీదు ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ప్రధానోపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. బుధవారం మధ్యాహ్నం పెనుమంట్ర మండలం మార్టేరు శ్రీవేణుగోపాల స్వామి ఆడిటోరియంలో నరసాపురం డివిజన్ ప్రధానోపాధ్యాయుల సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ 52 రోజులు పరీక్షా కాలం ఉందని, ఇప్పటి వరకు నిర్వహించిన పరీక్షల్లో విద్యార్థి ఏ సబ్జెక్టు అయితే వెనుకబడ్డారో? వాటిని గుర్తించి ఆవిభాగాన్ని సులభతరంగా విద్యాబోధన చేసే ఉపాధ్యాయులతో విద్యాబోధన చేయించి ఉత్తీర్ణులయ్యేలా సమాయత్తం చేయాలని కోరారు. పాఠశాల వారీగా ఎస్ఏ–1, ఎస్ఏ–2లో విద్యార్థులు సాధించిన ఫలితాలపై డీఈఓ నారాయణ ప్రధానోపాధ్యాయులతో సమీక్షించారు. అన్ని పాఠశాలలను ఎంఈఓలు, డీఈఓ తనిఖీ చేస్తామని, విద్యార్థులకు అదనపు తరగతులను సక్రమంగా నిర్వహించి సత్ఫలితాలను పొందాలని కోరారు. కార్యక్రమంలో తణుకు డీవైఈఓ మురళీ శ్రీనివాస్ సత్యనారాయణ రెడ్డి, ఎంఈఓలు వై.లక్ష్మీనారాయణ, ఉంగరాల నాగేశ్వరరావు, పి.పుష్పరాజ్యం, శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ అధ్యక్షుడు నేలపాటి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రోగికి ఆర్థిక సాయం

పాలకొల్లు అర్బన్: అనారోగ్యంతో బాధపడుతున్న ఆచంట గ్రామానికి చెందిన తోలేటి శ్యామలకు వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు రూ.10వేలు ఆర్థిక సహాయం చేశారు. ఈ సహాయాన్ని పాలకొల్లు వసుధ ఫౌండేషన్ క్యాంపు కార్యాలయంలో బుధవారం క్షత్రియ సంక్షేమ పరిషత్ ఉపాధ్యక్షుడు చేకూరి సూరిబాబు చేతుల మీదుగా రోగి తల్లి మేలా లక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితురాలికి రూ. 30 వేలు సాయం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక 23వ వార్డుకు చెందిన వి.మాలాశ్రీ అపెండిసైటిస్ ఆపరేషన్ కోసం ఆర్థిక ఇబ్బందులు పడుతుంది. విషయం తెలుసుకున్న దాత పొట్నూరి అప్పన్న రూ.20 వేలు, యునైటెడ్ కాపు సంఘం రూ. 5 వేలు, ఉనికెల నాగేశ్వరరావు రూ. 5 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలికి ఈ సొమ్మును అందించారు. ఆపరేషన్ అనంతరం మందులను వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకర్ అందజేయనున్నట్లు అప్పన్న తెలిపారు.

రీ-సర్వేతో భూ సమస్యల పరిష్కారం



పెనుమర్రులో రీ సర్వే ర్యాలీలో పాల్గొన్న ఆర్డీఓ దాసి రాజు

యలమంచిలి: రీ సర్వే వల్ల ప్రతి రైతుకు తమ భూమి కచ్చితంగా ఎంత ఉందో సమగ్రంగా తెలుస్తుందని, భూ సమస్యలు పరిష్కారమవుతుందని నరసాపురం రెవెన్యూ డివిజనల్ అధికారి దాసి రాజు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రీ–సర్వే ప్రాజెక్టులో పెనుమర్రు గ్రామాన్ని పైలట్ గ్రామంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా రీ సర్వే పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు బుధవారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్‌కుమార్, సర్పంచ్ కవురు గోపి, ఎంపీటీసీ సభ్యురాలు కవురు నాగలక్ష్మీ డిప్యూటీ తహసీల్దార్ పూడి డేవిడ్‌సన్, ఆర్ఐ కవురు యశోద పాల్గొన్నారు.

దేవలో..

పెనుగొండ: ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా భూములను రీసర్వే చేస్తామని పెనుగొండ తహసీల్దారు జి.అనిత కుమారి అన్నారు. బుధవారం పెనుగొండ మండలం దేవలో రీసర్వే ప్రాజెక్టుపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. రీ సర్వేకు దేవ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొన్నట్లు వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పాలపర్తి సుబ్రహ్మణ్యం, సర్పంచ్ నల్లా సత్యనారాయణ, ఉప సర్పంచ్ సాకా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.